క్లుప్తంగా

రేపు నడింపాలెంలో గడప గడపకు

కొయ్యూరు: మండలంలోని నడింపాలెం సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. అన్ని శాఖల అధికారులు రావాలని, వలంటీర్లు విధిగా హాజరుకావాలని కోరారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి అభినందనలు



ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి అభినందనలు తెలుపుతున్న డాక్టర్ నరసింగరావు

సాక్షి,పాడేరు: ఆంధ్రా విశ్వవిద్యాలయానికి నాక్ ఏ డబుల్ ప్లస్ గుర్తింపుతో అరుదైన గౌరవం దక్కడంపై ఏయూ వైస్ ఛాన్సలర్ పీవీజీడీ ప్రసాదరెడ్డికి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు అభినందనలు తెలిపారు. ఆయన శనివారం వీసీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అల్లూరి జిల్లాలోని ఉన్నత విద్యా కార్యక్రమాలపై సమీక్షించారు.పాడేరు మండల పాస్టర్ల సంఘం ప్రతినిధి బాబూరావు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి సారె ఊరేగింపులో భక్తులు

కొయ్యూరు: సింగవరంలో వెలసిన మరిడమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగవరం నుంచి ఆలయం వరకు భారీ ఊరేగింపుతో అమ్మవారికి సారెను తీసుకెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్ నాయకత్వంలో గిరిజనాభివృద్ధి

సాక్షి, పాడేరు: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గిరిజనుల అభివృద్ధి చెందుతుండడం సంతోషంగా ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ భీమిలీ నియోజకవర్గ పరిశీలకుడు పసుపులేటి బాలరాజు తెలిపారు. ఆయన శనివారం చింతపల్లిలో పర్యటించి, స్థానిక నాయకులతో మాట్లాడారు. వైఎస్సార్ ఆశయాల సాధన లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరవేరుస్తుండడం చరిత్రాత్మకమన్నారు.

ఘనంగా సహకార సంస్థ వారోత్సవాలు



సొసైటీ బ్యాంకు వద్ద జెండా ఆవిష్కరిస్తున్న బ్యాంకు చైర్మన్ రామకృష్ణ తదితరులు

హుకుంపేట: అఖిల భారత సహకార సంస్థ సొసైటీ 70వ వార్షికోత్సవాన్ని శనివారం హుకుంపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ బ్యాంకు చైర్మన్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో అఖిల భారత సహకార సంస్థ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ బ్యాంకు ద్వారా గిరిజనులను అనేక రుణాలు అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు భీమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ముంచంగిపుట్టు: వాహనచోదకులు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్‌ఐ కె.రవీంద్ర అన్నారు.మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో రోడ్డుకు ఇరువైపుల అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపి ఉండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. వారపు సంత రోజు వాహనాలకు కేటాయించి స్థలంలోనే పార్కింగ్ చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

గడప గడపలో సంక్షేమం



చెరుకుబిడ్డలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు



సంక్షేమ పథకాల బ్రోచెర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అనంతగిరి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపలో సంక్షేమ వెలుగులు విరాజిల్లుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గుమ్మ పంచాయతీలోని చెరుకుబిడ్డ, కరీవేసు, కరీగుడ, కడరేవ్, కళ్యాణిగుమ్మి, మద్దిపాడు, మిర్కిదుంగడ, నిమ్మ ఊట, ఎగువముల్లెలు, దిగువముల్లెలు, చీడివలస, పార్లువలస, కరకవలస, వంజనివలస, మంగగుమ్మ గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 476 గడపలను ఆయన సందర్శించి, ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సమరెడ్డి పాలెం నుంచి వంజనివలస రూ.80లక్షలతో తారు రోడ్డు, గుమ్మ నుంచి నిమ్మఊటకు తారురోడ్డు, కరీవేసు నుంచి పార్లువలస జీఎస్‌బీ రోడ్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్‌లు రాములమ్మ, పెంటమ్మ, అప్పారావు, సన్యాసిరావు, మజ్జి సన్యాసిరావు, ఎంపీటీసీ మితుల, అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యానారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ నవీన్, నాయకులు లక్ష్మణ్‌రావు, గంగులు, దానియేలు, గంగరాజు, మధుసూదన్, సత్యనారయణ, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: గతంలో ఏ ప్రభుత్వం జరగని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరుగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌లు అన్నారు. మండలంలోని బడదనాంపల్లి సచివాలయ పరిధిలోని బడదనాంపల్లి, చిన రెల్లంగిపాడు, లక్కవరప్పాడు, రాజు పేట గ్రామాల్లో శనివారం వారు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 300 గడపలను సందర్శించారు. వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు.

బడదనాంపల్లి పంచాయతీలో 2030 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం రూ.9.26 కోట్ల మేర నగదు జమ చేసిందన్నారు. మరో రూ.1.52 కోట్ల వ్యయంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, నాడు–నేడు తదితర అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని తక్షణం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు చుంద్రు లోవలక్ష్మి, కనిగిరి గంగదుర్గ, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, చీడి శివ, సవిరెల చంద్రుడు, ఆగూరి శుభలక్ష్మి, కించు వెంకటలక్ష్మి, తొంటా ఆదిరాజు, నాయకులు వెంకటేష్‌రాజు, వెంకటరమణ, కుశరాజు, దుర్గప్రసాద్, రాంబాబు, ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు, డీటీ సత్యనారాయణ, సీఐ షేక్ బాజీలాల్, ఎస్‌ఐ ఎస్.వెంకయ్య, ఏపీఎం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పరికరాలు



మాట్లాడుతున్న ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి

గంగవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో బి.శ్రీనివాసులు అధ్యక్షత జరిగిన దివ్యాంగులకు, వృద్ధులకు కృత్రిమ పరికరాలు ఎంపిక శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అర్హులైన దివ్యాంగులకు, వయోవృద్ధులకు వివిధ రకాల కృత్రిమ పరికరాలను ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలం నీతీ ఆయోగ్ బ్లాక్ డవలప్‌మెంట్ మండలంగా గంగవరం ఎంపకైందన్నారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ శిబిరంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు పరీక్షలు నిర్వహించి, సదరన్ ధ్రువపత్రంలో 40 శాతం వైకల్యం పైబడిన అర్హులకు కృత్రిమ పరికరాలను ఉచితంగా అందజేస్తామన్నారు. దివ్యాంగ సంక్షేమశాఖ సీఆర్‌ఓ అప్పలనాయుడు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో దివ్యాంగ సంక్షేమానికి తగిన కృషి చేస్తున్నామన్నారు. దివ్యాంగ డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు ల్యాప్‌టాప్, టచ్‌ఫోన్లు మంజూరు చేస్తున్నామని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈవోపీఆర్డీ నరసింగరావు, ఏఓ సిద్దేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గత్తుమలడలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది



జడేరులో రోగుకి వైద్య సేవలందిస్తున్న డాక్టర్

ముంచంగిపుట్టు: మండలంలో గల పెదగూడ పంచాయతీ గత్తుమలడ గ్రామంలో కిలగాడ పీహెచ్‌సీ సిబ్బంది ద్వారా నిర్వహించిన వైద్య శిబిరంలో 47 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. చలికాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది రామకృష్ణ, చంద్రకళ, పుష్ప , నేత దాసు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని జడేరు గ్రామంలో రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ సంచార వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్ మాట్లాడుతూ శిబిరంలో సుమారు 100 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసినట్టు చెప్పారు. ప్రతి నెల మూడవ శనివారం జడెరు గ్రామంలో వైద్య శిబిరం జరుగుతుందని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ రాయుడు శ్రీనివాస్ రామకృష్ణ మిషన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై శిక్షణ



జీకే వీధిలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి/అడ్డతీగల/కొయ్యూరు: కుల గణనపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈనెల 27 నుంచి శిక్షణ ఇస్తున్నట్టు జీకే వీధి, అడ్డతీగల ఎంపీడీవోలు ఉమామహేశ్వరరావు, కె.బాపన్నదొర చెప్పారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్ల ద్వారా గ్రామాల్లో కుల గణన సమాచారం సేకరిస్తామన్నారు. ఈ మేరకు ఆయా సిబ్బందికి ఈనెల 20న ఒక రోజు శిక్షణ ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యాప్ ద్వారా సర్వే చేస్తారన్నారు. గ్రామాల్లో శానిటేషన్ మెరుగుపరచాలని తెలిపామన్నారు. ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు. కొయ్యూరు మండలంలోని ఈనెల 21న కులగణనపై శిక్షణ ఉంటుందని, సచివాలయ సంక్షేమ సహాయకులు, వీఆర్‌వోలు, వలంటీర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో లాలం సీతయ్య చెప్పారు.

ఘనంగా జాతీయ గౌరవ దివస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్, తదితరులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ సేవా పథం, నెహ్రూయువ కేంద్రం సంయుక్తంగా జన్ జాతీయ గౌరవ దివస్‌లో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్,

డాక్టర్ సీహెచ్.రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన స్వతంత్ర సమరయోధులను త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఎన్‌వైకె విశాఖ యూత్ ఆఫీసర్ మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ గిరిజనుల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. యువత దేశాభివృద్ధిలో ముందుండాలన్నారు. బిర్సాముండా జయంతి ఉత్సవాలు 2021లో ప్రారంభించి, దేశ వ్యాప్తంగా గిరిజనుల స్వేచ్ఛకోసం పోరాడిన స్వతంత్ర్య ఉద్యమకారుడి చరిత్రను యువతకు వివరించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు నాగరాజు, వై.విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, ఎన్‌వైకె సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం



విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీబాబు

మారేడుమిల్లి: మండలంలోని కొత్తకాలనీలో జీపీఎస్ పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ తన సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్లు, పుస్తకాలు, శానిటైజర్లు తదితర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, చదువుల్లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లలను రోజూ బడికి పంపించాలని కోరారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు పిబే, శైలజ , వైస్ సర్పంచ్ బోడ్డేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటల, వ్యాసరచన పోటీలు



మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



హుకుంపేటలో వ్యాచరచన పోటిల్లో విద్యార్థులు



గంగవరంలో వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు



వై.రామవరంలో పుస్తక ప్రదర్శన

డుంబ్రిగుడ/హుకుంపేట/గంగవరం/వై.రామవరం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో డుంబ్రిగుడ, హుకుంపేట, గంగవరం, వై.రామవరం ప్రాంతాల్లో శనివారం జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆయా ప్రాంత గ్రంథాలయాధికారులు శెట్టి సునీత, మానస, గంగాభవానీ, సత్యవతి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

వీఆర్ పురం: రేఖపల్లిలో ఆదివారం జరగనున్న గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమానికి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కె.అప్పారావు హాజరు కానున్నట్టు ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జీకే వీధిలో జల్‌జీవన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మి



జీకే వీధిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ రామకృష్ణ



సీలేరులో పనులు ప్రారంభించిన సర్పంచ్ రాజు

గూడెంకొత్తవీధి: రింతాడ పంచాయతీ రావిమానుపాకలలో జల్ జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న పైపులైన్ పనులకు సర్పంచ్ బొబ్బిలి లక్ష్మీ శనివారం భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పైపులైన్ ఏర్పాటుతో తాగునీటి సనస్య తీరుతుందన్నారు. గ్రామ పెద్ద గణపతి తదతరులు పాల్గొన్నారు. దామనాపల్లిలో రోడ్డు పనులకు సర్పంచ్ రామకృష్ణ శంకుస్థాపన చేశారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చొరవతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలతో రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. వార్డు సభ్యుడు కృష్ణారావు పాల్గొన్నారు.

సీలేరు: దారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.5లక్షలతో చేపడుతున్న పైపులైన్ పనులను సర్పంచ్ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న ,బాకూరి కోటేశ్వరరావు, పాండురాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్ భాగ్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు కమల

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కుయిలంగి గ్రామంలో 25 మంది విద్యార్థులకు జర్రెల పంచాయతీ సర్పంచ్ బొరగం భాగ్యవతి తన సొంత నిధులతో పలకలు, స్టడీ మెటీరియల్‌ను ఎంపీటీసీ సభ్యురాలు కమల చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యవతి మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో పుస్తకాలు, పలకలు, స్టేషనరీ సామాగ్రిని అందిస్తున్నామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుడు సాంబశివరావు, నేత సురేష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఔదార్యం



ఆర్థిక సాయమందిస్తున్న నేతలు

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ పంచాయతీ పనసలొద్దిలో కడు పేదరికంతో బాధపడుతున్న కొర్రాత్రినాథ్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేతలు అండగా నిలిచారు. త్రినాథ్ అడవికి వెళ్లి కట్టెలు కొట్టి పేదరికంతో జీవనం సాగిస్తున్న సమాచారాన్ని తెలుసుకొని నాయకులు వంతల చంటిబాబు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పాతుని లక్ష్మణ్, మొండిగెడ్డ వార్డు సభ్యులు వంతల రాజారావు, స్థానికులు గెమ్మెలి లక్ష్మణ్, కొర్ర ధర్మరాజు డేవిడ్ చంటీలు నగదు, నిత్యావసరాలను ఆ పేద కుటుంబానికి అందజేశారు. పేద కుటుంబ దయనీయ స్థితిని ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి తెలియజేసి, ఆర్థికం సాయం కోరుతామన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పిచ్చయ్య తదితరులు

చింతపల్లిరూరల్: మాదిగ సామాజిక న్యాయ మహాసభ డిసెంబర్ 7వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్టు జిల్లా దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ముద్దా పిచ్చయ్య చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాదిగల సమస్యల పరిష్కారం కోసం ఈ సభను నిర్వహిస్తున్నమన్నారు. ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి, చిన్న, గెడ్డం సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

మారేడుమిల్లి/కూనవరం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ మారేడుమిల్లి, కూనవరం ప్రాంతాల్లో శనివారం ధర్నా నిర్వహించారు. రత్నకుమారి, ప్రసూన, గంగ భవాని, పెంటయ్య, శ్రీనివాసరావు, ప్రసన్న, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



సాక్షి, పాడేరు: అరకులోయ మండల కేంద్రంలోని భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

అర్హులకు ఉచిత గ్యాస్ కనెక్షన్

ఎటపాక: అర్హులందరికి కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందజేస్తోందని బీజేపీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్ చెప్పారు. పథకంలో భాగంగా సిలిండర్, స్టావ్, రెగ్యులేటర్, పైపు ఉచితంగా ఇవ్వాల్సి ఉండగా, మండలంలోని వీఆర్ పురం, ఎటపాక మండలాల్లోని పలు ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి అదనంగా సొమ్ము వసూలు చేస్తున్నట్టు ఆరపించారు. అధికారులు విచారణ చేసి బాధ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చెట్టి వినయ్

ముంచంగిపుట్టు: కిలగాడ పంచాయతీ కొత్తుల బయలు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాంగి గోపి శనివారం హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ గ్రామానికి వెళ్లి గోపి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనందరావు, అప్పారావు, బాలరాజు, కోటిబాబు, భరత్‌కుమార్ ఉన్నారు.

కనబడుటలేదు



పూజారి కొండబాబు ... 32 సంవత్సరాలు, ... పెదబయలు మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా ... 26-07-2022న ... 29-08-2022న పెదబయలు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేయడమైంది. ... సెల్ నెంబర్: 9440904227, ... ఫోన్: 9440904222కు తెలపగలరు. ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం అయినది.

ప్రకటన



తేదీ 12-12-2020న 17.00 గంటల సమయంలో ఒకవైపు WB02Y8988 నంబర్ ప్లేట్ మరొక వైపు OR02BG3636 నంబర్ ప్లేట్ కలిగిన తెల్లటి మారుతి కారు అనుమానాస్పదంగా రోడ్డు ప్రక్కన ఆగి వుండటంతో వెళ్ళి చూడగా అందులో ఎవరూ లేనందున కారు యొక్క ఇంజన్ & చాసిస్ నెంబర్లను పరిశీలించగా ఇంజన్ నంబర్ M16A1298251 & చాసిస్‌నంబర్ MA3EFJC1S00117595*K7 అయ్యి వున్నది. ఈ కారుకు సంబంధిత పత్రాలు వున్నట్లయితే పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిలీజ్ చేసుకోవలసిందిగా ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం అయినది.